# పుత్రకామేష్టి

ఆదూరి వెంకట సీతారామమూర్తి



"చెప్పు మరీ."

సమాధానంకోసం ఆమె కళ్ళలోకి చూశాడు రాజారావు.

దించిన తలెత్తి, రెప్పలు కదిల్చి అతనివంక చూసింది వసంత.

"ఎట్లాగూ అంతవరకూ వెళ్తున్నాను- ఈలోగా అనుకోకుండా యీ శుభలేఖ. అఫ్టరాల్ ఫోరవర్స్ జర్నీ- నాకేం పట్టింపు లేదు. నువ్వు సరేనంటేనే...." ఆగేడు-

సున్నితంగా, సాధ్యమైనంత నెమ్మదిగా తలూపింది వసంత. "గుడ్. అలా వుండాలి. రేపు సాయంత్రానికల్లా వచ్చివాలనూ ?" బూట్ లేసులు బిగించుకుని లేచాడు.

భరవంక తదేకంగా చూసింది వసంత-ఎందుకో.... మనసంతా దిగులు- ఇంతకు ముందెన్నడూలేనిది-ఎన్నిమార్లు భర్త కేంపులమీద వెళ్ళలేదు ? కానీ... ఈ మధ్యే....

"మరి నాకు ఇవ్వాల్సింది యివ్వవూ" కోర్కె రగిలే కళ్ళతో ఆమె కళ్ళలోకి చూశాడు రాజారావు.

అ చూపుల్లో అల్లరి వుంది- అందముంది- అనురాగమూ వుంది.

"పాపం ! ఒద్దు మరీ...." అంటూ మూతి ముచ్చటగా తిప్పి రెప్పలు బరువుగా వాల్చింది- అది సిగ్గే !

ఆమె ముఖాన్ని రెండు చేతుల్తోనూ తనవైపుకు తిప్పుకున్నాడు రాజారావు.

ఆమె పెదవులు సంతృప్తిగా కదిలాయి- సిగ్గు దూరమైంది !

భర్త ఎక్కిన ఆటో వీధిమలుపు తిరిగేవరకూ చూసి, లోపలికొచ్చి సోఫాలో చతికలబడింది- హృదయం బరువెక్కింది.

'అతనికి పెళ్ళి!' అనుకుంది శుభలేఖను చేతిలోకి తీసుకుంటూ-

గాలికి గుమ్మానికి కట్టిన మువ్వల తోరణం కదిలి సన్నని శబ్దమైంది- అదే గాలికి రాజారావు ముచ్చటపడి తీసుకొచ్చిన పెద్దకళ్ళ ప్లాస్టిక్ బొమ్మ టీపీ మీద అందంగా కదిలి వింత శబ్దం చేసింది.

వసంతలో గతపు జ్ఞాపకాలు లీలగా కదిలాయి.

* * *

"డాడీ...." అంటూ తలుపు తోసుకుని లోపలికొచ్చి ఏదో అనబోయి కొత్త వాతావరణాన్ని కొత్త మనుషుల్నీ చూసి చటుక్కున వూరుకుంది అమ్మాయి.

అనుకోని సంఘటనకు రాజారావూ, వసంతా యిద్దరూ ఆశ్చర్యపోయి ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

ఆ అమ్మాయికి నాలుగేళ్ళుంటాయి- ఆకుపచ్చరంగు పట్టు పావడా, జాకెట్టూ, కాలికి మువ్వల పట్టాలూ, చేతులకు బంగారు గాజులూ, చెవులకు వేలాడే ఒన్న ముత్యపు లోలాకులూ- 'సీతా కళ్యాణం'లో బాలసీతలా వుంది అనుకున్నాడు రాజారావు. వసంత కూడ ఆ అమ్మాయిని చూసి చాల ముచ్చటపడింది.

'రా పాపా' అంటూ కళ్ళు కాస్త పెద్దవిచేసి తలూపి పిల్చింది.

ఆ పాప రాలేదు- ఒక్క క్షణం పాటు రెప్పవేయకుండా వసంత వంకా, రాజారావు వంకా చూసింది.

"పక్కింట్లో ఈ రోజే ఎవరో కొత్తగా దిగినట్టుంది- బహుశ వారి పాపేమో" అని "చాలా ముద్దుగా వుంది కదూ" అంటూ రాజారావువంక చూసింది వసంత.

రాజారావు వసంత వంక చూడ్లేదు- ఆమె మాటలు కూడా విన్పించుకున్నట్టు కూడా లేదు-

"దామ్మా పాపా. నీ పేరేంటి" అన్నాడు ఆ పాపనే.

మువ్వలు కదిలాయి. రెండడుగులు ముందుకు వేసి అక్కడే నిలబడిపోయి కుడిచేతి బొటకన వేలిని నోట్లో పెట్టుకుంది పాప. రెండో చేతిలో వూపితే గణగణలాడుతూ శబ్దం చేసే పెద్ద కళ్ళున్న బొమ్మ వుంది.

"నీ పేరు చెప్పవూ?" అంటూ చేతులు చాపేడు రాజారావు. వసంత వంక కొత్తగా చూస్తూనే రాజారావు వైపు అడుగులేసి, "సుమలత" అంది.

"అబ్బో! మంచి పేరే నే-" అన్నాడు రాజారావు ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుంటూ-

తను పిల్చినా రాకుండా ఆ అమ్మాయి రాజారావు దగ్గరికి వెళ్ళడంతో వసంత

చిన్న బుచ్చుకుంది. దానికి తోడు 'మూశావా' అన్నట్లుండే రాజారావు చూపు।

అంతలోనే 'సుమా' అనే పిలుపు విన్పించడం, ఆ అమ్మాయి 'ఆఁ' అని పరుగెత్తి వెళ్ళిపోవడం ఒక్కసారే జరిగిపోయాయి.

ఆ అమ్మాయి వెళ్ళిన కాస్సేపటి వరకూ రాజారావు, వసంత అలానే వుండిపోయారు.

'పెళ్ళయి ఆరేళ్ళయింది- తమకే ఆ అదృష్టముంటే..' ఆలోచనను అక్కడే ఆపేసింది వసంత. రాజారావు ఆమె వంక చూశాడు. ఆ చూపులో ఎన్నో ప్రశ్నార్థకాలు.... ఎన్నో భాష కందని భావాలు।

కాస్సేపు మౌనం వహించి, లేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది వసంత. బట్ట లేసుకుని రాజారావు బయటకు నడిచాడు.

* * *

పని పూర్తిచేసుకుని డాబామీదికి వెళ్ళింది వసంత.

ఆలోచనలు మాత్రం ఆమెను వదలటం లేదు-

'ఎక్కడుందీ లోపం?' అనేది ఆమె నిరంతరం ఎదుర్కొనే ప్రశ్న అయిపోయింది- మొదటి రెండేళ్ళూ కొత్త మోజు. ఆ తర్వాత రెండేళ్ళూ అలవాటు పడిన జీవితం- ఈ రెండేళ్ళలోనే రాజారావులో ఆ అసంతృప్తి।

తల్లి కావాలని ప్రతి స్త్రీ ఉబలాటపడుతుంది- మరి తండ్రి కావాలని ప్రతి పురుషుడూ కోరుకుంటాడా? లేక రాజారావే....

పిట్టగోడ నానుకుని వీధి చివరకు దృష్టి సారించింది వసంత.

'రావటం లేదు' అనుకుంది.

ఇంట్లో వున్నంతసేపూ అదో ధీమా. కల్సి మాట్లాడుకోకపోయినా, బయటకెళ్తే మాత్రం వచ్చేవరకూ బెంగే-.

తల తిప్పి చూసి ఆశ్చర్యపోయింది- ఎదురింటి డాబామీంచి అతను తననే చూస్తున్నాడు।

* * *

"ఇదిగో వసంతా.... ఒక్కసారిలా వస్తావా?" కుక్కర్ స్టౌవ్‌మీది కెక్కించి చేతులు తుడుచుకుంటూ ముందు గదిలో కొచ్చింది.


"ఈయన శ్రీహరనీ మనింటికి ఎదురుగా వున్న ఇంట్లో అద్దెకుంటున్నారు."

"నమస్కారం" అన్నాడు శ్రీహరి.

చేతులు జోడించి అతని వంక చూసింది. వయసు ముప్ఫయి లోపే వుండొచ్చు. వంకీల జుట్టూ, ఎర్రగా దృఢంగా వున్నాడు.

"చీరల బిజినెస్సట- కొత్త రకాలేవో వచ్చాయని శాంపిల్స్ తెచ్చాడు. చూస్తావా" అన్నాడు రాజారావు.

ఆ మాటకు అతనివంక ఆశ్చర్యంగా చూసింది.




బ్రీఫ్‌కేస్ తెరిచి ఓ పది వెరైటీలు తీసి టేబిల్‌మీదుంచాడు శ్రీహరి.

"చూడు. నచ్చితే తీస్కో." అన్నాడు రాజారావు నవ్వుతూ.

అదే అదను చేసుకున్నాడు శ్రీహరి. ఒక్కో చీర కవర్లోంచి తీసి దాని మన్నిక, ప్రింటింగు, బార్డరు గురించి చెప్పడం మొదలుపెట్టాడు-

ఇంచుమించు అన్నీ కొత్త వెరైటీలే- వాటిల్లోంచి ఒక్కటి మాత్రం ఏరి, 'ఇది తీస్కోనా' అనబోయి, "ఎలా వుందిదీ" అని భర్త కందించింది.

"బావుంది తీస్కో" అన్నాడు రాజారావు వసంత చేతిలోని చీరను చేత్తో ముట్టుకుంటూ.

ఉగాది ఎట్లాగూ వస్తోంది. తెలుగు సంవత్సరపు ఆనవాయితీగా ఓ చీర ఎట్లానూ కొనక తప్పదు- ఇలా అయితే అతగాడూ సంతోషిస్తాడు; వసంతా ఆనందిస్తుంది- ఇదీ రాజారావు ఉద్దేశం.

"ఒక్కటేనా? మరోటి ఏహాద చూడరూ?" అతను- భర్త కళ్ళల్లోని యిబ్బందిని కనిపెట్టింది వసంత.

"ఈమాటుకి చాల్లెండి. మీరిక్కడే ఉంటారుగా మరోమారు చూద్దాం" అంది.

అతను వెళ్ళిపోయాక రాజారావు అన్నాడు- "ఏదో మరి, నిరుద్యోగి.... మనం ఎంకరేజ్ చేయకపోతే ఎట్లా?"

అర్థమైంది వసంతకి. మరేం మాట్లాడలేదు.

* * *

మెట్లు దిగి ముందు గదిలోనికొచ్చి పత్రిక చేతిలోకి తీసుకుంది. అప్పుడే విచ్చుకుంటున్న సన్నజాజులమీది

పరిమళం కిటికీలోంచి వచ్చి గదంతా ఆవరించింది

రోజూ అయితే ఆవేళకి సన్నజాజులు వసంత తలలో సొగసులీనేవి.

కానీ.... ఈ రోజు వసంతకామూడ్ లేదు.

మనసంతా ఏవో కళవళం.... విసుగూ.... అసంతృప్తీ....

ఆ సంఘటన తర్వాత ఒక్కమాటైనా మాట్లాడకుండా ఆ చూపుతోనే తన నిరసనను వ్యక్తంచేసి రాజారావు వెళ్ళిపోవడం వసంత మనసును పిండేసినట్లయింది

ఈ రెండేళ్ళనించీ సమయమొచ్చినపుడల్లా తన అసంతృప్తిని వెళ్లడిస్తూనే వున్నాడు రాజారావు.

'మా వంశంలో వంధ్యుత్వంలేదు- మీకా అనుమానముండి నాదే లోపమనుకుంటే నేనేం చేయలేను-' అని ఎన్నో మార్లు అందామనుకునికూడ పెదవి విప్పలేకపోయింది.

ఆ క్షణమొచ్చి తీరా అది అనేసరిక్కి దెబ్బతిన్న పులిలా చూశాడు రాజారావు ఆమెవైపు.

"అయితే లోపం నాదనేగా ?" అతని పెదవులు అస్పష్టంగా కదిలాయి- ఆ లోపం ఎవరిలోవుందో తెల్సుకుని భరించే శక్తి లేదతనికి.

సిగ్గుతో, అవమానంతో తలదించుకుందపుడు. కానీ- ఆ అవమానం కత్తిలా దూసుకొచ్చి, నిప్పులా తనను హరిస్తూంటే.... ఎన్నాళ్ళిలా ?

తలుపుచప్పుడైతే లేచి గడియతీసింది.

ఎదురుగా నవ్వుతూ రాజారావు !

అలుముకున్న మబ్బులన్నీ ఏ పిల్లగాలికో చెల్లాచెదరైనట్లు.... మామూలు మనిషిలా వున్నాడు.

గంటక్రితం అసంతృప్తి....మరిప్పుడిది ? జీవితంలో రాజీయా ? 'నిజంగా అతనిలో ఆ కోర్కె బలంగానే వుందా ?' అన్పించింది ఆమెకు, ఆ క్షణాన రాజారావుని చూస్తే.

* * *

అడవులూ, నగరాలూ అనే తేడా లేకుండా విరగకాస్తూంది వెన్నెల. మల్లెపూలూ, నిండువెన్నెలా, పిల్లతెమ్మెరా కల్సుకున్నాయాగదిలో- ఆ రాత్రి- ఆ మల్లెపూలు వసంతవి. ఆ గది రాజారావూ వసంతల పడగ్గది- కిటికీలోంచి పడుతూన్న వెన్నెల వసంత పూలను తాకితే, పిల్లతెమ్మెర అలసిన రాజారావు వంటిని నిమిరింది.

అలవాటుపడిన కార్యక్రమానికైనా తప్పదు కాబోలు ! కల్సుకున్న రెండు మంచాల్లోనూ అవతలి మంచంమీదికి జరిగి, సుషుప్త్యావస్థలోకి ఒరిగి అటు తిరిగాడు రాజారావు. చీర సవరించుకుని, జాకెట్ హుక్స్ పెట్టుకోడానికి లేవబోతూ కిటికీలోంచి బయట వెన్నెల్ని చూడబోయి గేతుక్కుమంది వసంత.

ఎదుటి డాబామీద కదిలిననీడ ఎవరిదో ఆమెకు తెల్సు.

బాహ్యచక్షువులు మూసుకున్నా ఆమె ఆలోచనానేత్రం తెరుచుకుంది.

* * *

శ్రీహరిని మళ్ళీ వసంత చూడ్డం అది రెండోసారి.

అలవాటైన మనిషిలా అతను తెర తొలగించుకుని ముందుగది లోపలి కొచ్చాడు. స్నానం చేసి పలుచని చీర వంటికి చుట్టబెట్టుకుని బెడ్‌రూమ్‌లోకి పోబోతోంది వసంత- వంటింట్లోంచి గాని బాత్రూంలోంచిగాని బెడ్ రూమ్ లోకి వెళ్ళాలంటే ముందుగదిలో నుండి వెళ్ళాలి. ఆ సమయంలో.... అంటే.... సాయంత్రం అయిదు గంటలకు ఆ యింటికొచ్చేది రాజారావు మాత్రమే- నాలుగు గంటలకు రెండో విడత టపా, నాలుగున్నరకి బూత్ నించి పాలు తెచ్చే పాలమనిషి- అంతే.

అనుకోని సంఘటనకు సిగ్గుపడి పోయింది వసంత. పర పురుషుడిముందు అర్ధనగ్నంగా ఆమె అంతకుముందు ఎన్నడూ కన్పించలేదు.

మెరుపులా ఒక్కంగలో బెడ్ రూంలోకెళ్ళి తలుపేసుకుంది.

అతనికీ ఆ పరిస్థితి యిబ్బందిగానే తోచింది. వెనక్కి తిరిగి వెళ్ళిపోవడమా వుండడమా అనుకుంటూనే, "నేను మళ్ళీ వస్తానండీ" అన్నాడు గదిలోని ఆమెకు విన్పించేలా. ఆ కంఠంలోని నమ్రత, గౌరవభావం ఆమె చెవికి తోచాయి.

"తలుపేసుకోవోడం తనదే తప్పు" అనుకుంది.

'అఁ' అంటే . అతను ఏమను కుంటాడో! బొత్తిగా సభ్యత సంస్కారం తెలీని మనిషనుకుంటే! ఆడది లేని పోని సిగ్గునభినయిస్తే ఎట్లాంటి పురుషు డైనా చలించేది!

"ఆగండి. ఒక్క క్షణం."

అసలేం జరగలేనట్టూ; అతను తెచ్చే చీరల కోసమే ఆతృత చూపుతున్నట్టూ- ఆ కంఠం.

జాకెట్ హుక్సూ; చీర కుచ్చెళ్ళూ చూసుకున్నాక, జుట్టును వేలితో ముడివేసి, నుదుట తిలకం దిద్దుకుని తలుపు తీసింది.

"అయ్యో! నిలబడే వున్నారా? కూర్చోండి" అంది నొచ్చుకుంటూ

ఆ వంటరి కొత్తదనం, అంతకు ముందు దృశ్యం; ఆమె స్ఫటికంలాంటి అందం.... అతని నోటంట మాట రానీ కండా చేశాయి- కూర్చుని; కొన్ని క్షణాల్లో తేరుకుని,

"కొత్త ప్రింట్సు వచ్చాయి. మీరు చూస్తారనీ...." బ్రీఫ్‌కేస్‌ను టేబిల్‌మీద ఉంచాడు.

"వారింకా రాలేదు" అంది సంశ యిస్తూ.

"మీరు చూడండి చాలు. నచ్చితే డబ్బు సంగతి తర్వాత" అన్నాడు.

ఆ మాటకు అతనివంక చూసింది.

ఆ కళ్ళలో మెరుపు; చురుకుదనం కన్పించాయి.

ఒకోక్క చీరతీసి వాటి గురించి చెబుతున్నాడతను.

"ఇది చూడండి. మీలాంటి అందమైనవాళ్ళకి మరింత అందాన్నిస్తుందీ చీర."

ఆ మాటకు ఆశ్చర్యంగా అతనివంక చూసింది—

తను అందమైందా?

నిజంగా తన అందాన్ని మెచ్చుకుంటున్నాడా.... లేక ప్రతి స్త్రీముందూ యిలాగే అంటాడా?

'మీరు అందమైనవారు' అంటే యే స్త్రీ అయినా వెంటనే ఒప్పుకోదు. లోపల సంతోషించినా సరే-తర్వాత ఆ మాటను నిజంచేయటానికి వివిధ రకాల ప్రశ్నలేస్తుంది. నోరుజారిన పురుషుడైనా ఆ సమయంలో ఆమె అందమైనదేనని సమర్థించక తప్పదు.

కానీ.... ఆ పరిస్థితి తేలేదు వసంత—

ఆ చూపుకి; ఆ మవునానికీ భయపడి తలొంచుకున్నాడతను.

రాజారావు రావడంతో పరిస్థితి మామూలు వాతావరణంలోకి వచ్చింది.

ఆ రోజునించే శ్రీహరి చూపులోని మార్పును గమనిస్తోంది. సాయంత్రాలెప్పుడూ ఆ దాబామీదే వుంటాడు.

సన్నజాజులు కోసినా, మొక్కలకు నీళ్ళుపోసినా, డాబాఎక్కినా, ఆ చూపులు వసంతను పరిశీలిస్తూనే వుంటాయి.

* * *

"వసంతా డియర్...." బెడ్‌రూంలోంచి కేక.

ఉదయం ఆ పిలుపొచ్చిందంటే అటుయిటుగా సంస్కృతంలో వార్తలు మొదలవ్వచ్చు.

'ఓ.... వచ్చే వచ్చే' అని పలికి; ఫిల్టర్ కాఫీ క్షణంలో కలిపి కప్పులో పోసి తీసుకొచ్చి డబుల్‌కాట్ ప్రక్కనున్న టీపాయ్‌మీద పెట్టింది వసంత.

పువ్వులా బోంబేడైయింగ్ దుప్పట్ని ముసుగెట్టి అడ్డంగా పడుకునివున్నాడు రాజారావు.

"లేవండి మరి; కాఫీ చల్లారిపోతుంది" అంటూ ఫేనాపేసి, రేడియో అన్‌చేసింది.

"ఇతి వార్తాయ...."

వార్తలు వింటూ బెడ్‌కాఫీ తాగడం షేవ్‌చేసుకుంటూ సిలోన్‌పాటలు వినడం స్నానంచేయకముందు పేపరు చదవడం, టిఫిన్‌తింటూ భార్యతో మాట్లాడ్డం.... ఇదీ రాజారావు ఉదయం కార్యక్రమం—

"ఈ వీక్లీ చూశావూ? ఈ మధ్య ఢిల్లీలో జరిగిన భారతీయ మహిళా సదస్సులో చర్చించిన ఒక వింత సమస్యను ప్రచురించారు. వివిధరకాలకు చెందిన స్త్రీలు ఆ సమస్యను చర్చించి తమ తమ అభిప్రాయాలను పత్రికాముఖంగాకూడ అందజేశారు."

ఉప్మాలోని జీడిపప్పును స్పూన్‌లో కెక్కించి నోటిలో పెట్టుకోబోతూ అడిగాడు రాజారావు.

అతని కెదురుగా డైనింగ్ టేబిల్ వద్ద కూర్చుని అతనితోపాటే టిఫిన్ తింటున్న వసంతకు పలుగురాయి పంటికిందపడి కటక్‌మంది. రాయిని చేత్తో జాగ్రత్తగా తీసేసి:

“లేదు” అంది రాజారావు ప్రశ్నకు సమాధానంగా.

“మెజారిటీ ఒపీనియన్‌తో నువ్వు యేకీభవిస్తావో లేదో చదివి చెప్పు.”

రాజారావు ఆఫీసుకెళ్ళిపోయాక వంట పనంతా పూర్తిచేసుకుని, కేరేజీపెట్టి, వీక్లీని చేతిలోనికి తీసుకుంది వసంత.

చర్చించబడ్డ సమస్యలో వింతేమీ కన్పించలేదామెకు.

మధ్యతరగతి భార్యాభర్తలు.... పెళ్ళయి పదేళ్ళయినా పిల్లలు కలగరు- భర్తకు పిల్లలమీద మనసు- పిల్లల కోసమేనని మరోపెళ్ళికి కూడ సిద్ధపడ తాడు. ఆ సందర్భంలో భర్తను అభిమానించే భారతస్త్రీ కర్తవ్యమేమిటి?

ఇది ప్రతిఒక్క స్త్రీ సమస్యా కాక పోవచ్చు. కానీ ఇటువంటి స్త్రీ సమస్యలను భారతదేశంలోని వివిధ తరగతులకు, వర్గాలకు చెందిన స్త్రీలు ఒకచోట కూడి చర్చించడం; పరిష్కారమార్గాల్ని సూచించడం ఎంతైనా సమంజసంగా కన్పించింది వసంతకు.

వారి సూచనల్లో.... కొంతమంది- భర్త మరోపెళ్ళికి సిద్ధపడినపుడు విడాకులు తీసుకునో; తీసుకోకుండానో ఆ స్త్రీ తన వ్యక్తిత్వం నిలబెట్టుకునేందుకు వేరేగా బ్రతకాలన్నారు. భర్త భార్యయందు అనురాగం చూపుతున్నంత కాలం ఆమె అతని నిర్ణయానికి ఒడంబడి, అభినందించి భర్తకు కలుగబోయే బిడ్డల్నే తన బిడ్డలుగా చూసుకోడం తప్ప మరో మార్గంలేదని మరికొందరు స్త్రీలన్నారు-

విశేషమేమిటంటే- ఈ రెండు వర్గాల స్త్రీలూ భర్త మళ్ళీ పెళ్ళిచేసుకుందుకే ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రోత్సహిస్తున్నారే తప్ప ఎక్కడా వ్యతిరేకతను వ్యక్తపరచలేదు.

చదివి; వీక్లీ మూసేస్తే.... ఒక స్త్రీ జాతి యివ్వాల్సిన పరిష్కారాలు ఇవి కావేమో ననిపించింది వసంతకు.

ఇంతకీ.... ఇది చదివి తన అభిప్రాయం చెప్పమనడంలో రాజారావు అంతర్యం వసంతకు అర్థంకాలేదు. అర్థం చేసుకుందికి ప్రయత్నిస్తూంటే ఎన్నో ప్రశ్నలు!

ఒకవేళ రాజారావు నిర్ణయంకూడ అదేనా?

అదే అయితే మరి తన పరిష్కారం?

వసంత గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. తన ఉద్దేశాన్ని నోటంట చెప్పకుండానే ఎదుటివార్ని సంఘర్షణకు

గురిచెయ్యడం నిజంగా ఎంతో తెలివైన వారేగాని చేయలేరు.

రాజారావు మళ్ళీ తనను ఆ విషయమై ప్రశ్నిస్తే యేంచెప్పాలో తేల్చుకోలేదు వసంత.

కానీ ఎంచేతో రాజారావు ఆ విషయాన్ని మళ్ళీ కదపలేదు.

* * *

చీకటి !

చుట్టూ చీకటి ! ఒంటరిగా తను-

'ఈ ఒంటరితనం జీవితంలో అలవాటైపోయింది తనకి-' నిట్టూర్చింది వసంత-

గాలికి వాకిలిముందున్న పూల మొక్కలు వూగి, పూలపరిమళం ఒక్కసారి వసంతను చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసింది.

ఒంటరికాక....? మాతృత్వం లేకపోతే స్త్రీకి పరిపూర్ణత లేదు- నిండుగా, నిండా పదినెలలు మోసే అనుభవం; ఒక ప్రక్క పురిటినొప్పులతో బాధపడుతూనే క్షణానికో ఘడియకో సృష్టికర్తగా మారుతున్నందుకు సంతోషపడ్డం; ఆ బాధ, ఆ కేకలు, ఆ నరకంనించి మరో జన్మ ఎత్తేక పక్కలో పొత్తిళ్ళలో కదిలే ఆ చిన్న ప్రాణి నాలుగుచుక్కల పాలతో కాళ్ళూ చేతులూ ముడుచుకుని, కళ్ళు మూసుకుని, 'ఇక భారం మీదే' అన్నట్లు నిశ్చింతగా నిద్రించినపుడు కలిగే ఆ అవ్యక్తానుభవం- వెన్నెల రాత్రి వెండిగిన్నెలో పాలబువ్వను తినిపిస్తూ వాటితో మాట్లాడుతూ జీవితంలోని మధురానుభూతుల్ని నింపుకునే సంఘటనలు తనకి లేవు. భవిష్యత్ రావు.

వసంత కళ్ళలో నీటిపొర జేరింది.

వంధ్యత్వం ఒక శాపం- ఆ శాపం నుంచి బయటపడ్డంకోసం పూర్వపు రాజులు యజ్ఞయాగాదులు చేసేవారు- ఆ శాప విముక్తికోసం భర్త భార్యకు సాయపడేవాడు- సంతానంకోసం దీక్షగా గోవుతో గడిపిన రాజుల చరిత్రలూ, రాత్రంతా అశ్వంతో గడిపిన రాణుల కథలూ; కేవలం పిల్లలకోసమే భర్త అనుమతితో పరపురుషుడిని కూడిన వనితల గాథలూ ఎన్నో వున్నాయి. కానీ- ఒక పవిత్ర కార్యాన్ని సాధించాలనే దీక్ష గల ఆ కార్యాలన్నీ క్రమంగా సంస్కరింపబడ్డాయి. ఇప్పుడు స్త్రీ ఒక నిర్మల మూర్తి- పతివ్రత- ఆమె చుట్టూ ఆచార వ్యవహారాల పరుధులు- సాంప్రదాయపు కట్టుబాట్లు !

ఎక్కడ్నించో నీటిగాలి ఒక్కమారు వీచింది-

ఆకాశంలో ఒకటి రెండు మబ్బుతునకలు అటూ, యిటూ కదలాడుతున్నాయి.

'వర్షం వస్తుంది కాబోలు.' ఆకాశం వంక చూసింది వసంత.

వర్షానికి భూమాత పులకరిస్తుంది- విత్తులు మొలకెత్తుతాయి- చెట్లు చిగురిస్తాయి- పూలు పులకించి పరిమళాలు వెదజల్లుతాయి.

నాలుగురాళ్ళు వెనకేసుకొనే రోజులివి!




నిట్టూర్చింది వసంత.

చీకట్లో గేటు తెరుచుకుని ఎవరో వస్తున్నట్లై అటువంక చూసి, కాస్సేపట్లోనే పోల్చుకుంది-

"మాష్టారున్నారాండీ?"

ఆ గొంతు పరిచయమైందే-ఆ వ్యక్తి కూడ. "లేరు" అంటూ లేచి నిలబడింది-

సంశయంగా కదిలి; "వస్తారా యిప్పుడు" అడిగాడు శ్రీహరి.

"ఆఫీసు పనిమీద సికింద్రాబాద్ వెళ్ళారు."

"నాకు పంజాబ్ నేషనల్ బేంక్‌లో వుద్యోగ మొచ్చింది- రేపే వెళ్ళి చేరాలి. మాష్టారికి చెప్పి వెళ్దామనీ...."

చెట్ల ఆకుల సందుల్లోంచి జారిన పల్చని వెలుగు అతని ముఖంమీద అందంగా పడుతూంది. ఆ వెలుగులో అతని కళ్ళలో వింత కాంతి ఆమెకు ద్యోతకమయింది.

పదేళ్ళ తన వైవాహిక జీవితంలో యిట్లా మగాడిని చూడటం; ఆ చూపులోనూ అందం, వింత వెలుగూ చోటు చేసుకోడం ఎన్నడూ జరగలేదు-వంటరి తనంలో ఆలోచన్లు వక్రంగా వుంటాయా?

"రండి. శుభవార్త తెచ్చారు. కాస్సేపు కూర్చుని వెళ్దురుగాని" పుట్టుకతో వచ్చిన సంస్కారం.... మర్యాద- అతిథి సత్కారం.

గుమ్మం దాటి ఎడంపాదం గదిలో పడింది-

చీకటి!

బయటగాలీ; పల్చని వెలుగూ- మన సులో ఆచనలూ :

గదిలో దీపం వెలిగిచలేదనే త త్తర పాటు-

అగ్గిపెట్టె వెదికి కొవ్వొత్తి వెలిగించి గదిమధ్య నుంచింది-

గదినిండా లేత బంగారురంగు వెలుగు :

లోపలికొచ్చి మెత్తని సోఫాచివర కూర్చున్నాడతను. అతనికి ఎడంచేతి వైపు నైలాను పట్టీలల్లిన స్టీలు కుర్చీలో ఆమె.

భావ తరంగాలకు తట్టుకోలేని మనసులా ఇద్దరి మధ్యా రెపరెపలాడుతూ దీపం :

తనావూరొచ్చినకొత్తలో రాజారావుతో పరిచయం; రాజారావు ప్రోత్సాహం.... నాలుగైదు ముక్కల్లో చెప్పాడు శ్రీహరి.

"ఆయనకూడ మీ గురించే చెప్పే వారు...." అంటూ ఏదో మాట్లాడాలనే యిబ్బంది మాటలు ... మనసులోంచి రానిమాటలు....

లోపలికెళ్ళి ప్లేట్లో కోవా తెచ్చి ముందుంచింది-

"ఈ శుభసమయంలో...." అంటూ, చిన్నగా నవ్వుతూ-

"నాకు కోవా అంటే ఎంతో ఇష్టం" అన్నాడు తలొంచుకుంటూ- కోర్కెను, అభీష్టాన్ని బహిర్గతంచేసిన సిగ్గుతో-

'నిజం?' అన్నట్టు చూసింది-

వంకీలజుట్టూ, స్ఫుటంగా తేలిన ముక్కూ, ఆ క్రింద రెక్కలుచాచిన తుమ్మెదలా మీసకట్టూ, లేతాకుపచ్చలో కొనదేలిన గడ్డం.... చేతులు మడిచిన తెల్లనిచొక్కా.... అంతకుముందు అవ గతంకాని అందం-

బరువుగా రెప్పలువాల్చి వేలితో కుర్చీ పట్టీమీద అర్థంలేని గీతలు చూపుడు వేలితో గీసింది-

తలెత్తిచూశాడతను.దీపం వెలుగులో బంగారురంగు చీరలో పెళ్ళికూతుర్లా తలొంచుకుని....ఆమె.

గాలికి రేగినా అందానిచ్చే ముంగు రులూ.... ఎర్రగా జ్ఞాననేత్రంలా వెలిగి పోయే.... నుదుట కుంకుమ.

నిశ్శబ్దం భరించలేక చటుక్కున రెప్పలెత్తి చూసింది- దొరికిపోయిన దొంగలా తడబడ్డాడతను- ఆహ్వానం లేకపోయినా వయసులా, పడుచుదనపు కోర్కెలా కిటికీరెక్కల్లోంచి దూసుకు వచ్చింది గాలి-

తెల్ల మేఘానికి దొరికిపోయిన జాబిల్లిలా గిలగిల్లాడింది.

దీపం : దాన్ని రక్షించడంకోసం వీధి తలుపుకు బోల్టువేసింది వసంత-

అప్పటికీ.... నాట్యంనేర్చిన సుంద రిలా అలసి, గాలికి దొరికిపోయింది గోరంతదీపమూ-

అగ్గిపెట్టెకోసం లోపలకు పోబోయి, కుర్చీ తగిలి, సోఫామీదికి తూలి....

పాతాళంలోంచి జలాన్నీ, జలపాతాన్నించి విద్యుత్తునూ, విద్యుత్‌నించి సుఖాల్నీ సమకూర్చుకుంటున్న మనిషి మనసు పొరల్లోని కోర్కెల్ని జోల పాడి....

చీకటి: తప్పుకూ, తన్మయత్వానికీ, శోధనకూ-

ఆమెను పొదివిపట్టుకున్నాడతను-

ఆ పట్టులోంచి విడిపించుకుందికి ప్రయత్నంచేయలేదామె.

* * *

పెళ్ళికాకముందు వసంత కృతుల వరకూ నేర్చుకుంది- పెళ్ళయ్యాక వీణను తనతోపాటే తెచ్చుకుంది- రాజారావుకి సంగీతంలో సాహిత్యంలో సోపానాలు తెలీవు- కానీ వసంతను వీణవాయించే భంగిమలో చూసి చాల ఆనందపడిపోతాడు. అతనికి సంగీతంలో లోతులు తెలియకపోయినా గమకాల్లో తలాడించడం తెల్సు- తాళజ్ఞానం లేకపోయినా స్వరానికితగ్గట్టూ వేళ్ళని కదపడమూ తెల్సు- సంగీతంలోని నిశ్శబ్దతకు తన్మయత్వం చెందడమూ తెల్సు-

పెళ్ళయిన తర్వాతకూడ కొన్నాళ్ళ తీరిక సమయాల్లో వీణవాయించేది- ఒక్కోప్పుడు రాత్రులు రాజారావు కోరితే శృతిచేసేది- తర్వాత్తర్వాత జీవితంపట్ల విసుగూ, మనసులో అశాంతీ, ఏకాంతమూ చోటుచేసుకున్నాక అన్నిటిమీదా ఆమెకు విరక్తిపుట్టింది. అంచేతే ఆ వీణకు మంచంకిందే స్థిరనివాసం ఏర్పడింది-

ఇన్నాళ్ళకి.... వసంతకు మళ్ళీ దానిమీదికి దృష్టి మరలిందంటే రాజారావుకి చాల ఆనందమనిపించింది- ఊరినుండి వచ్చాక చూశాడు. తీగెలుపోయి మంచం క్రిందే మగ్గుతూన్న వీణ సవరించిన శృతులతో ఖుషీపడి గదిమధ్యలో వుంది. ఆ వెంటనే పుట్టిన కోర్కెను రాత్రి వరకూ దాచుకుని భోజనమయ్యాక వెల్లడించాడు. ఒక్కక్షణం రాజారావు ముఖంలోకి నిదానంగా చూసి, చిన్నగా నవ్వి వీణముందు కూర్చుంది.

"నిన్ను కోరియున్నానుర.... నెనరుంచి.... నన్నేలుకోర"

వసంతరాగాన్నాలాపించింది వసంత-

తన్మయుడై వింటున్నాడు రాజారావు-

స్వరంవెనుక భావం.... ఎదురుగా తన్మయుడైన భర్త....

చమటతో తడిసి ముద్దవుతోంది.... అలవాటుతప్పి, వేళ్ళు వణుకుతున్నాయి-

"....ధా, ధమధ.... నినిధధమ- గమ గరిస- మగమ- సారి...."


అక్కడితో ఆగి, స్వరం మరిచి, తాళం తప్పి....

....ఈ అపశృతిని తను కప్పిపుచ్చగలదా?

శృతి సరిచేసి మళ్ళీ వాయించింది- మళ్ళీ అక్కడే:

....వేళ్ళు కదలనని మొరాయించాయి-

వాతావరణం మీకు చాలా అనుకూలంగా మారుతుంది!




పాలభాగాలమీద స్వేద బిందువులు.... ముత్యాల్లా!

"ఫర్వాలేదు బాగుంది- యూ కెన్ ప్రొసీడ్...." రాజారావు చెవికి అప స్వరం సోకలేదు-

"ఫర్వాలేదు!.... ప్రొసీడ్...." భర్త ముఖంలో ఆనందం- 'స్లో.... డెడ్ స్లో.... డేంజర్.... పుర్రె; రెండు ఎముకలూ' వసంత మనసులో భీతాహం.

"యస్... ప్రొసీడ్...సందేహించకు"

'....గమగరిస.... మగమ- సారి... సమగమధని....'

ఏలాగో పూర్తయింది-

ఒక్కో- స్వరానికి ఒక్కో-భావం మనసులో-

లేచి, నీలంబల్బు వేసి, మంచంమీద వాలింది వసంత-

హృదయంలో సముద్రం- మనసంతా పొగమంచు ... కళ్ళలో నీళ్ళు!!

"ఛ. యీ మాత్రందానికే..." దగ్గరకు తీసుకున్నాడు.

ఆ 'దగ్గర'లో ఓదార్పే వుందారాత్రి.

* * *

ఆలోచనలు ఆపి, అల్లుతున్న ఊలు స్వెట్టరు బల్లమీద పెట్టి సోఫాలోంచి లేచింది.... భారంగా.

టి. వి. మీద కదిలేబొమ్మ వింత శబ్దాల్ని చేస్తూనేవుంది అతిసున్నితంగా.

కేలెండర్ లో బోసినోటిబాబు నవ్వుతూనేవున్నాడు-

ఇంకెన్నాళ్ళు?

వారంరోజుల్లో తనూ....

సంతృప్తిగా ఆమెకళ్ళు మెరిశాయి!